సాక్షి నిర్మల్

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



బీపీఎంలకు కొత్త ఫోన్లు
రాష్ట్ర ప్రభుత్వం బీపీఎంలకు కొత్త సెల్ ఫోన్లను అందించాలని నిర్ణయించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 579 ఆండ్రాయిడ్ మొబైల్స్ సరఫరా చేసింది. 8లో▸



ఆర్జీయూకేటీలో ముగిసిన వర్క్‌షాప్
బాసర ఆర్జీయూకేటీలో ఎలక్ట్రిక్ వాహనాలపై మూడు రోజులు నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. 75 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 28.8 /24.4
ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తగ్గుతాయి. ఒకటిరెండుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సబ్ కలెక్టర్ ఏవో సస్పెన్షన్

భైంసాటౌన్: భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ విధుల్లో చేరిన వెంటనే తనదైన శైలి కనబరుస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే కార్యాలయ ఏవో(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) రవిపై సస్పెన్షన్‌వేటు వేశారు. సదరు ఏవో కార్యాలయ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో ఆయనపై చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. రెండు రోజుల కిందట ఏవోను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఈ విషయమై 'సాక్షి' సబ్ కలెక్టర్ సంకేత్‌కుమార్‌ను వివరణ కోరగా, ఏవో సస్పెన్షన్ వాస్తవేమన్నారు. అనారోగ్య కారణాలతో విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో కలెక్టర్ ఏవోను సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చిట్లు పేర్కొన్నారు. దీంతో ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్న సంకేతాలిచ్చినట్లయిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రుమ్మెల్ల యోగిత

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థిని రుమ్మెల్ల యోగిత రాష్ట్రస్థాయి పరుగు పందేనికి ఎంపికైనట్లు ప్రధానాచార్యులు సారథి రాజు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పరుగు పందెంలో 60 మీటర్లు, 600 మీటర్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రోత్సహించిన పీఈటీలు కైలాస్, శ్రీనివాస్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ నెల 30, 31వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

న్యూ బొప్పారం వాసికి అవార్డు


రాజేందర్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన చొక్కాల రాజేందర్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును ఆదివారం స్వీకరించారు. శ్రీవేదాస్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఆచార్య జయశంకర్‌సార్ 91వ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘ భవనంలో విశిష్ట అతిథులు జస్టిస్ చంద్రకుమార్, బ్రహ్మశ్రీ మోత్కూరి వీరబ్రహ్మయ్య ఐఏఎస్, శ్రీ వేదాస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగోజి సంతోష్ కుమార్ అవార్డులు ప్రదానం చేశారు. రాజేందర్ ప్రస్తుతం గుడిహత్నూర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం


టేబుల్ టెన్నిస్ కోర్టు ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: క్రీడలు ఒత్తిడి నుంచి ఉపశమనానికి, శారీరక, మానసిక ఆరోగ్యానికి తోడ్పడతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన కోర్టును కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కాసేపు టేబుల్ టెన్నిస్ ఆడారు. తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయ పనిఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఉద్యోగులు, సిబ్బంది విధులు ముగిసిన తర్వాత కోర్టును వినియోగించుకోవాలని సూచించారు. సాధారణ ప్రజల కోసం పట్టణంలో మరిన్ని టేబుల్ టెన్నిస్ కోర్టులను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సీపీవో జీవరత్నం, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విషజ్వరాల విజృంభణ

- ఇంటికి ఒకరిద్దరు బాధితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- డెంగీ, వైరల్ జ్వర బాధితులతో నిండిన వార్డులు


ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన జ్వరపీడితులు, వారి బంధువులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవలి వర్షాలు.. తర్వాత మారిన వాతావరణ పరిస్థితులు, జలాశయాల్లో కొత్తనీరు రాక, దోమల నియంత్రణ లేకపోవడం తదితర కారణాలవో జ్వరబాధితులు పెరుగుతున్నారు. ఇంటికి ఒకరిద్దరు జ్వరంలో బాధపడుతున్నారు. నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తున్నవారిలో జ్వరపీడితులే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రులు కూడా జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ, వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఆస్పత్రికి వస్తున్నారు. పది రోజులుగా జిల్లా ఆస్పత్రిలో నిత్యం ఓపీ 1200 నుంచి 1400 నమోదవుతుంది. ఇన్‌పేషెంట్లుగా 400 మంది చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో ముగ్గురు డెంగీ బాధితులు ఉన్నారు. చిన్నారులు, వృద్ధులు జ్వరాలతో ఇన్‌పేషెంట్‌గా చేరుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట..
ప్రైవేటు ఆస్పత్రులు కూడా జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. అయితే, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి జ్వర కేసుల వివరాలు అందడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ రోజువారీ సమాచారం అందించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ప్రైవేట్ ఆస్పత్రులు ఈ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. రోజువారీ కేసుల వివరాలు అందితే, జ్వర కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. సమాచారలోపం కారణంగా వ్యాధుల నియంత్రణలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న డెంగీ కేసులు..


చిన్నపిల్లలకు చికిత్స అందిస్తున్న వైద్యుడు వసుకుమార్

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తడంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా డెంగీ కేసులు పెరిగాయి. వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన ఇంటింటి జ్వర సర్వేలో ఈ కేసులు వెలుగు చూస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 15 డెంగీ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. వైరల్ జ్వరాలు, డయేరియా, మలేరియా, టైఫాయిడ్, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలతో రోగులు ఆస్పత్రులకు చేరుకుంటున్నారు.

వైద్యాధికారుల సూచనలు..
జ్వరాల విజృంభణ నేపథ్యంలో వైద్యాధికారులు ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను సూచిస్తున్నారు.
- ఇంటి పరిసరాల్లో మురుగు గుంతల్లో రసాయన ద్రవాలు పిచికారీ చేసి పరిశుభ్రత పాటించాలి.
- పాత ట్యూబ్‌లు, కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమతెరలను ఉపయోగించాలి.
- జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలి.
- చిన్న పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి.
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

పూర్వ ప్రాథమిక పాఠశాలలకు 1,290 దరఖాస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లావ్యాప్తంగా ఇటీవల మంజూరైన 13 పూర్వ ప్రాథమిక పాఠశాలలకు 1,290 దరఖాస్తులు అందాయి. ఇందులో టీచర్ పోస్టులకు 989, ఆయా పోస్టులకు 301 దరఖాస్తులు వచ్చాయి. త్వరలోనే ఈ దరఖాస్తులను పరిశీలించి భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జాగ్రత్తలతో విద్యుత్ ప్రమాదాల నివారణ

- వినాయక మండపాల వద్ద అప్రమత్తత అవసరం
- సొంత విద్యుత్ పనులతో అనర్థాలు
- నిమజ్జన ఊరేగింపుల్లోనూ జాగ్రత్త


విద్యుత్ దీపాలతో జిగేల్‌మంటున్న వినాయక మండపం(ఫైల్)

భైంసా: వినాయక నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. మరికొన్ని గంటల్లో మండపాల్లో గణనాథులు కొలువుదీరనున్నారు. దీంతో మండపాలను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలంకరణలో, నిమజ్జన ఊరేగింపుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏడీఈ ఆదిత్య తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు వేలాడడం, షార్ట్ సర్క్యూట్‌లు, ఎర్తింగ్ వైర్లలో విద్యుత్ సరఫరా వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. విగ్రహాలను తరలించే సమయంలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద వేలాడే విద్యుత్ తీగలు తాకితే షాక్ కొట్టే ప్రమాదం ఉందని తెలిపారు.

మండపాల వద్ద జాగ్రత్తలు..
- మండపాల వద్ద విద్యుత్ పనులను జాగ్రత్తగా పరిశీలించి నిర్వహించాలి. స్తంభాల కింద మండపాలు ఉంటే, విద్యుత్ తీగలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి.
- విద్యుత్ కనెక్షన్ల కోసం బోర్డు, మెయిన్ స్విచ్, ఫ్యూజ్‌లను తప్పనిసరిగా ఉపయోగించాలి.
- విద్యుత్ సరఫరాకు ఉపయోగించే వైర్లు అతుకులు లేనివి, నాణ్యమైన కంపెనీలవి ఉండేలా చూసుకోవాలి. ప్లాస్టిక్ ఇన్సులేషన్ లేని వైర్లను ఎట్టిపరిస్థితుల్లోనూ వాడరాదు.
- అలంకరణకు వాడే లైట్లు, వైరింగ్ నేల నుంచి కనీసం ఏడు అడుగుల ఎత్తులో ఉండేలా చూడాలి.
- చిన్న పిల్లలను విద్యుత్ తీగలు, స్తంభాలకు దగ్గరగా రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మెయిన్ స్విచ్ బోర్డు వద్ద రబ్బర్ మ్యాట్, అగ్ని ప్రమాద నిరోధక సామగ్రిని అందుబాటులో ఉంచాలి.
- రద్దీ ప్రాంతాల్లో నిమజ్జన శోభాయాత్ర సమయంలో అనుభవజ్ఞులైన ఎలక్ట్రీషియన్‌ను అందుబాటులో ఉంచాలి.

నిమజ్జన శోభాయాత్రలో జాగ్రత్తలు..
- నిమజ్జన శోభాయాత్రలో ఉపయోగించే ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు టైర్లు, బ్రేకులు సరిగ్గా పనిచేసే స్థితిలో ఉన్నవి మాత్రమే అద్దెకు తీసుకోవాలి.
- వాహనాలను నడిపేందుకు అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే నియమించాలి. కొత్త డ్రైవర్లకు వాహనాలను అప్పగించరాదు.
- ప్రస్తుతం భారీ వర్షాల కారణంగా చెరువులు, నదులు, ప్రాజెక్టులు నీటితో నిండి ఉన్నాయి. నిమజ్జనం కోసం చీకటి పడకముందే ఏర్పాట్లు పూర్తి చేయాలి.
- నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి, తద్వారా సురక్షితంగా నిమజ్జనం జరిగేలా చూడాలి.
- నిమజ్జనం సమయంలో ఒడ్డు నుంచే విగ్రహాలను నీటిలోకి వదలాలి. ఎక్కువ లోతులోకి వెళ్లడం, ఈత రాని వారిని నీటిలోకి పంపడం వంటివి కచ్చితంగా నివారించాలి.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ జానకీషర్మిల


మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల, పక్కన ఏఎస్పీ రాజేశ్‌మీనా

నిర్మల్ టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో హిందూ ఉత్సవ శాంతి కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మతపరమైన విభేదాలు లేకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. గణేశ్ పండుగ మొదలుకుని, విగ్రహాల నిమజ్జనం వరకు చాలా క్రమబద్ధంగా జరిగేలా ప్రత్యేక మార్గదర్శకాలు పాటించాలన్నారు. ప్రజల సహకారంతోనే పోలీస్ విభాగం అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపడుతుందని తెలిపారు. సమావేశంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, హిందూ ఉత్సవ శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా పోలీసులు
సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నా ణ్యమైన పోలీసింగ్‌ను ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఆశ వర్కర్ల పోరుబాట


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లు పోరుబాట పట్టారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. ఆశ వర్కర్లు పారితోషికాలు తగ్గించాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. గతంలో చెల్లించినట్లు మొత్తం డబ్బులు ప్రతినెలా చివరి నాటికి ఖాతాల్లో జమ చేయాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశ వర్కర్లకు ప్రమోషన్ కల్పించాలని లేదంటే వెయిటేజీ మార్కులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.గంగమణి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.సుజాత, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకళ, విజయ, అనసూర్య, సరిత, ఇంద్రమాల, నంద, జిల్లా సహాయ కార్యదర్శులు సులోచన, మౌనిక, విజయ, శ్యామల, పద్మ, కమల, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్య అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలి
నిర్మల్‌చైన్‌గేట్: ప్రీప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం రద్దు చేయాలన్నారు. పీఎంశ్రీ, ప్రీస్కూల్ విద్యను పాఠశాలల్లో నిర్వహిస్తే విద్యార్థులు పోషకాహారానికి, ఆరోగ్య పరీక్షలకు దూరమవుతారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, ఉపాధ్యక్షులు గంగమణి, రాజమణి ఉన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న హంపోలి గ్రామస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: భైంసా మండలం హంపోలి గ్రామంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను మళ్లీ అక్రమంగా చేసిన పట్టా రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. ఆ స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అదనపు కలెక్టర్‌కి వినతి పత్రం అందించారు. 1983లో వరదల కారణంగా 16/అ, 16/ఈ సర్వే నంబర్ లోని ఐదు ఎకరాల పట్టా భూమిని కొని ఎస్సీ ఎస్టీలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు ఇళ్లను కూల్చి.. స్థలాన్ని ఇతరులకు అక్రమంగా పట్టా చేశారన్నారు. దీనిని రద్దు చేయాలని తహసీల్దార్, ఆర్డీవో పై అధికారులకు నివేదికలు పంపినా రద్దు కాలేదన్నారు. అక్రమ పట్టా చేసిన అప్పటి తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని, అక్రమ పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత, గ్రామస్తులు విఠల్, గంగారం, సాయినాథ్, బాబు, ఎల్లన్న, భోజన్న, నరసన్న పాల్గొన్నారు.

ప్రజావాణి.. పరిష్కారం కాదేమి?

- వచ్చిన దరఖాస్తులే మళ్లీ మళ్లీ..
- ఇందిరమ్మ ఇళ్లు, భూసమస్యలే అధికం
- వినతులు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం


బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి వందకుపైగా దరఖాస్తులు వస్తున్నాయి. వాటిలో పది, ఇరవై మాత్రమే పరిష్కారం అవుతున్నాయి. మిగతావి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో బాధితులు సమస్యపై పదేపదే కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ జిల్లా అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. భూమి ఆక్రమణలు, దివ్యాంగుల పెన్షన్ ఆలస్యం, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, పట్టా పాస్‌బుక్‌లో లోపాలు వంటి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 105 దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పరిష్కారం కాని దరఖాస్తుల విషయంలో బాధితులకు స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, ఏవో సూర్యారావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

వనమహోత్సవం త్వరగా పూర్తి చేయాలి..
ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నాటిన మొక్కల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేయాలని సూచించారు.

మట్టి గణపతులను పూజిద్దాం..
ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను పూజించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ మేరకు అవగాహన కల్పించేందుకు జిల్లా అధికారులతో కలిసి మట్టి గణపతుల పూజను ప్రోత్సహించే పోస్టర్ విడుదల చేశారు.

తాగునీరు అందించాలి



మేము మహాలక్ష్మివాడకు చెందిన డబుల్‌బెడ్రూం కాలనీవాసులం. 28 అపార్ట్‌మెంట్లకు కలిపి కేవలం రెండు బోర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. తాగడానికి నీళ్లు లేక కొనుక్కునే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్య కూడా ఉంది. వెంటనే సమస్యలు పరిష్కరించాలి
– మహాలక్ష్మివాడ డబుల్‌బెడ్రూం వాసులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి..



జిల్లా కేంద్రంలోని కంచరోని కట్ట కింద ఉన్న శ్యామ్‌ఘడ్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 1446లో 25 1448లో 27 గుంటల భూమిని కొందరు ఆక్రమించారు. సిమెంట్ కాంక్రీట్‌తో ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి.
– మారుతి, నిర్మల్

భూములు లాక్కోవాలని చూస్తున్నారు..



మేము కడెం మండలం నవాబ్‌పేట్ గ్రామస్తులం. మాకు సర్వే నంబర్ 22లో వ్యవసాయ భూములు ఉన్నాయి. 28 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. దీనిని ఆనుకుని దస్తురాబాద్ శివారు 470 సర్వే నంబర్ ఉంది. ఫారెస్ట్ అధికారులు 470 సర్వే నంబర్‌లో ఈ 22 సర్వే నంబర్ ఉందని మా వ్యవసాయ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. రెండు సర్వే నంబర్ల హద్దులో అటవీ శాఖ నిర్మించిన పిల్లర్లు ఉన్నాయి. అయినా వాటిని దాటి వచ్చి మా భూములు లాక్కోవాలని చూస్తున్నారు. మమ్మల్ని భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు.
– నవాబ్ పేట్ గ్రామస్తులు

శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టాలి



మేము భైంసా మండలం, గుండెగావ్ గ్రామస్తులం. దాదాపు 470 కుటుంబాలు దశాబ్దాల కాలంగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నాం. రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన పల్సీకర్ రంగారావు ప్రాజెక్టుతో మా విలువైన వ్యవసాయ భూముల తోపాటు ఇళ్లు, ఇళ్ల స్థలాలను కోల్పోయాం. ప్రస్తుతం ప్రాజెక్టు మూలంగా ఏటా గ్రామం ముంపుకు గురవుతోంది. ఇప్పటి వరకు పరిహారం, నివేశన పత్రాలు ఇవ్వలేదు. శాశ్వత గృహ నిర్మాణాలు చేపట్టాలి.
– గుండెగావ్ ప్రజలు

రద్దు చేసిన పోస్టులకు వేతనం..



2022, ఫిబ్రవరిలో 44 పీహెచ్ హెల్త్ వర్కర్ పోస్టులను మున్సిపాలిటీ రికమెండ్ చేసింది. సెప్టెంబర్‌లో ఆ పోస్టులను కలెక్టర్ రద్దు చేశారు. ఇందులో నుంచి 13 మంది కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది. కానీ ఇప్పటికి కూడా ఆ 13 మంది మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ ఔట్‌సోర్సింగ్ కింద జీతం పొందుతున్నారు.
– షోయబ్, నిర్మల్

క్లుప్తంగా

గుడుంబా విక్రేతలపై కేసు

నెన్నెల: గుడుంబా తయారు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్న చిన్నలంబాడితండాకు చెందిన పాల్త వెంకానాయక్, జాటోత్ శ్రీనివాస్, పెద్ద లంబాడితండాకు చెందిన దరావత్ స్వప్నపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తండాల్లో నాటుసారా తయారు చేసి ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. వారి నుంచి గుడుంబాతోపాటు రెండు బైక్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

చిరుతపులి దాడిలో మేక మృతి

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మేకల మందపై సోమవారం చిరుతపులి దాడి చేసింది. కొత్తపల్లికి చెందిన పవార్ రవీందర్ మేకలను సోమ్లా అనే కాపరి మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం పూట చిరుతపులి ఒక్కసారి మేకపై దాడి చేసి హతమార్చింది. కాపరి భయపడి దాక్కున్నాడు. అనంతరం అతడు గ్రామస్తులకు విషయం తెలియజేయగా, వారు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిరుతపులి దాడి చేసి మేకను చంపినట్లు జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ నిర్ధారించారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం బాబాసాగర్– కొత్తగూడ గ్రామాల మధ్య రహదారిపై సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాబాసాగర్‌కు చెందిన పొట్టె సంతోష్ కొత్తగూడెం నుంచి బాబాసాగర్ గ్రామానికి బైక్‌పై వస్తుండగా.. బాబాసాగర్ గ్రామానికి చెందిన ఎల్ములే వెంకటేశ్ మరో బైక్‌పై స్వగ్రామం నుంచి కొత్తగూడెంకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరి తలలతో చేతులు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గోదావరి పరిరక్షణకు పాదయాత్ర



పాదయాత్రలో మహారాష్ట్ర వాసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గోదావరి పరిరక్షణ కోసం మహారాష్ట్రలోని గంగోత్రి ఆశ్రమ భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. మహారాష్ట్రలోని పర్బని జిల్లా గంగాఖేడ్‌లోని గంగోత్రి ఆశ్రమానికి చెందిన పది మంది భక్తులు చేపట్టిన పాదయాత్ర సోమవారం హాజీపూర్ మండలానికి చేరింది. ఆగస్టు 3న గోదావరి పుట్టిన పవిత్ర ప్రదేశమైన త్రయంబకేశ్వర్ నుంచి పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతాన్ని మొత్తంగా ప్రదక్షిణ చేస్తున్నట్లు తెలిపారు. మరో 25 రోజుల్లో గోదావరి నది సముద్రంలో కలిసే అంతర్వేదికి చేరుకుంటామని అన్నారు. 10 మంది సభ్యులు, ముగ్గురు సహాయకులతో కలిసి రోజుకు 50 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర చేస్తున్నారు. నవంబర్ 3న గోదావరి ప్రదక్షిణ పూర్తి చేసి తిరిగి తమ ఆశ్రమానికి చేరుకుంటామని తెలిపారు.

మహిళ అదృశ్యం

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేటకు చెందిన మహిళ కనిపించడం లేదదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జాడి శాంతి(40)కి కొన్నిరోజులుగా మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. ఈ నెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శాంతి తిరిగి రాలేదు. దీంతో రెండు రోజులుగా బంధువులు, తెలిసినవారి ఇళ్లలో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ దొరకకపోవడంతో ఆమె భర్త శంకర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణులను హతమార్చిన ఇద్దరి అరెస్ట్



మాంసంతో పట్టుబడిన నిందితులు

సాత్నాల: వన్యప్రాణులను వేటాడిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ తెలిపారు. మహారాష్ట్రలోని పాండ్రకోడా అటవీ పరిసర ప్రాంతాల్లో నాలుగు నెమళ్లు, ఓ నిలుగాయిని పలువురు వేటాడి హతమార్చారు. మహారాష్ట్ర పార్వ గ్రామానికి చెందిన నిలేష్ చౌహాన్, రాథోడ్ రోహన్ పట్టుపడగా, భోరజ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన సందీప్ రాథోడ్, సంజీవ్ పరారీలో ఉన్నారు. హతమార్చిన వన్యప్రాణుల మాంసాన్ని గిమ్మ గ్రామంలో విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. వన్యప్రాణుల పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీపీఎంలకు కొత్త ఫోన్లు

- పింఛన్ పంపిణీ కోసం అందజేత
- ఉమ్మడి జిల్లాకు 579 మొబైల్స్ సరఫరా

జిల్లా	కేటాయించినసెల్‌ఫోన్లు
ఆదిలాబాద్	158
నిర్మల్	147
మంచిర్యాల	144
కుమురంభీం ఆసిఫాబాద్	130



బీపీఎంకు అందించే సెల్‌ఫోన్, ఇతర పరికరాలు

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత (చేయూత) కింద లబ్ధిదారులకు ప్రతీ నెలా పింఛన్ పంపిణీ చేస్తోంది. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ల (బీపీఎం) ద్వారా వీటిని అందజేస్తారు. ఈ మేరకు బీపీఎంలకు కొత్త సెల్‌ఫోన్లను అందించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 579 ఆండ్రాయిడ్ మొబైల్స్ సరఫరా చేసింది. ఇప్పటికే అన్ని జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. వాటిని మంగళవారం ఆయా కలెక్టర్ల ఆధ్వర్యంలో అందజేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన ఈ ఫోన్లు పింఛన్ పంపిణీకి మాత్రమే ఉపయోగపడతాయి.

అక్రమాలు అరికట్టేలా ...

వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత కార్మికులు, డయాలసిస్ పేషెంట్లు, బోధకాలు, హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం ప్రతినెలా చేయూత కింద పింఛన్లు అందజేస్తోంది. దివ్యాంగులకు రూ.3,016 అందిస్తుండగా, మిగతా వారికి రూ.2,016లను అందజేస్తోంది. పంపిణీలో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో గత నెల నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. యాప్ ద్వారా లబ్ధిదారుల కళ్లను స్కాన్ చేసి పింఛన్ అందజేస్తున్నారు. సిబ్బందికి గత నెలలోనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన సెల్‌ఫోన్లు అందించాల్సి ఉండగా ఆలస్యమైంది. ప్రస్తుతం కొత్త మొబైల్స్ జిల్లాలకు చేరగా వాటిని అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 579 మంది బీపీఎంలు చేయూత పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. వీరికి 5జీతో కూడిన సెల్‌ఫోన్లను ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే అన్ని జిల్లా కేంద్రాల్లోని డీఆర్‌డీఏ కార్యాలయాలకు ఈ ఫోన్లు చేరాయి. బీపీఎం పేరు, వారికి అందిస్తున్న ఫోన్ ఈఎంఐ నంబర్ వంటి వివరాలను ఆ శాఖ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మంగళవారం ఆయా కలెక్టర్ల ద్వారా బీపీఎంలకు అందించనున్నారు. సెల్‌ఫోన్‌తో పాటు చార్జర్, బ్యాక్ కవర్, ఫింగర్ ప్రింట్స్ నమోదు చేసే యంత్రాన్ని సైతం అందజేస్తున్నట్లు డీఆర్డీవో రాథోడ్ రవీందర్ తెలిపారు. సెల్ ద్వారా పింఛన్‌దారు ముఖ చిత్రాన్ని స్కాన్ చేసి వారికి నగదు అందజేస్తారని పేర్కొన్నారు.

ఎలుగుబంటి దాడిలో కూలీకి గాయాలు



గాయాలతో భూమయ్య

తిర్యాణి(ఆసిఫాబాద్): ఎలుగుబంటి దాడిలో ఓ వ్యవసాయ దినసరి కూలీకి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన ఆవుల భూమయ్య వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పశువుల కాపరి వేరే ఊరికి వెళ్లడంతో భూమయ్య సోమవారం పశువుల మేపేందుకు ఎదులపహాడ్ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా భూమయ్యపై దాడి చేసింది. దీంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి అరుపులు విన్న సమీపంలోని పాటగూడ గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన శోభన్

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి సోమగూడెం భరత్‌కాలనీకి చెందిన మల్లెపల్లి శోభన్(42) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలానికి చెందిన శోభన్ సోమగూడెంలో నివాసం ఉంటూ ఆటోరిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తలు గొడవ పడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన శోభన్ ఆదివారం ఉదయం 9.30గంటలకు పురుగుల మందు తాగాడు. మంచిర్యాల ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి సోదరుడు మల్లెపల్లి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ముల్కల్ల వాగొడ్డుపల్లెకు చెందిన కొట్టె బాపన్న(51) ఆత్మహత్య చేసుకున్నాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపన్న వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నడుం నొప్పి తీవ్రంగా ఉండడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. వ్యవసాయం, కూలీ పనులకు వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. పదేళ్ల క్రితం బాపన్న కుమారుడు చనిపోవడం, తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురై 24న సాయంత్రం 4గంటల ప్రాంతంలో ముల్కల్ల శివారులో గడ్డి మందు తాగాడు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె లలిత ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడి బలవన్మరణం



శ్రీనివాస్(ఫైల్)

శ్రీరాంపూర్: కుటుంబ కలహాలతో సింగరేణి కార్మికుడు గోర్కె శ్రీనివాస్(40) సీతారాంపల్లి వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియా హిమ్మత్‌నగర్‌కు చెందిన గోర్కె శ్రీనివాస్‌కు అదే ప్రాంతానికి చెందిన కొండపాక స్వరూపతో 2014లో వివాహమైంది. వీరికి కూతురు ఉంది. కాసిపేట 2 గనిలో ఉద్యోగరీత్యా రామకృష్ణాపూర్ ఏరియాలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య ఆర్థిక పరమైన అంశాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీనివాస్ భార్య కుటుంబ సభ్యులు అతడిని మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీనివాస్ సీతారాంపల్లి గోదావరి నది వద్దకు వెళ్లి తన తల్లి రాజమ్మకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని తెలిపాడు. రాజమ్మ అల్లుడు రమేశ్, చుట్టుపక్కల వారు గోదావరి నది పుష్కర్ ఘాట్ వద్దకు వెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయించే యువకుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో గంజాయి విక్రయించేందుకు యత్నించిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మంచిర్యాలకు చెందిన గూడెల్లి సాయికుమార్ అనుమానాస్పందగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. అతడి వద్ద 205 గ్రాముల గంజాయి లభించిందని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని బల్లార్షకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశాడని, కొందరికి విక్రయించేందుకు వచ్చాడని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసగించిన వ్యక్తులకు జైలు శిక్ష

చెన్నూర్: సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన ముగ్గురు వ్యక్తులకు ఆరు నెలల జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య సోమవారం తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తామని చెన్నూర్ పోలీసుస్టేషన్ పరిధి ఆదర్శనగర్‌కు చెందిన వంగల తిరుపతి వద్ద రూ.17లక్షలు, వంగల మధుకర్ వద్ద రూ.8లక్షలను గోదావరిఖనికి చెందిన వొజ్జ కొమురయ్య, రామకృష్ణాపూర్‌కు చెందిన ఎడ్ల భీమయ్య, ఎడ్ల రాజిరెడ్డి, అబ్దుల్ సలీమ్, కొత్తగూడెంకు చెందిన ఉండేటి ప్రశాంత్‌కుమార్, కొత్త వెంకటయ్య, మూరల హర్షవర్ధన్‌రావు, ఎల్లూరి వెంకటనిర్మలకుమార్‌లు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో డబ్బులు ఇవ్వాలని వారు ఒత్తిడి తెచ్చారు. 2016 ఆగస్టు 27న ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అప్పటి ఎస్సై బీ.చంద్రయ్య కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. విచారణలో కొందరిపై నేరం రుజువు కాకపోగా, నేరం రుజువైన ఎడ్ల రాజిరెడ్డి, ఉండేటి ప్రశాంత్, ఎల్లూరి వెంకటనిర్మలకుమార్‌లకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.3వేల చొప్పున జరిమానా విధించారు.

బాలింతకు దారి కష్టాలు



పసికందుతో బాలింతను వాగు దాటిస్తున్న నవీన్

బోథ్: సొనాల మండలంలోని పెద్దగూడ గ్రామానికి చెందిన రేణుక బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. సోమవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. తల్లీబిడ్డను పెద్దగూడకు 102 వాహనంలో తరలిస్తుండగా గ్రామానికి చేరువలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో పైలట్ భగత్ నవీన్ కుమార్ పసికందుతో పాటు తల్లిని తీసుకుని జాగ్రత్తగా వాగు దాటించాడు. వారిని క్షేమంగా ఇంటికి చేర్చాడు. కాగా, వంతెన లేక ఆదివాసీల ఇక్కట్లకు ఈ ఘటన ఓ నిదర్శనం.

రైలు కిందపడి వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్ కాలనీ సమీపంలో ఫ్లెటైవర్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు మంచిర్యాల వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతిచెందాడని పేర్కొన్నారు. మృతదేహం బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉందని, సంబంధీకులు 9490871784, 9948481902 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రిటైర్డు కార్మికుడు మృతి



నారాయణ(ఫైల్)

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని తీగల్ పహాడ్ రాంనగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు దొరిశెట్టి నారాయణ(62) సోమవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ రామ్‌నగర్‌లో నిర్మించుకుంటున్న ఇంటికి నీరు పట్టేందుకు బోర్ మోటార్ స్టార్టర్ స్విచ్చాన్ చేయబోయాడు. ఈ క్రమంలో కరెంటు వైరు షాక్ తగలడంతో కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


లక్ష్యసాధనకు కృషి చేయాలి



ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్: కంపెనీ నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్‌ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. అధికారులతో కలిసి క్వారీలో దిగి పని స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన ఓవర్ బర్డెన్ మట్టిని తొలగించాలన్నారు. ఓబీ సంస్థలు తమ లక్ష్యాన్ని అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఓపెన్‌కాస్ట్ గనికి నిర్దేశించిన 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని నూరు శాతం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్సార్పీ ఓసీపీ అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, ఇందారం ఓసీపీ అధికారి కే.వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్సార్పీ ఓసీపీ గని మేనేజర్ ఐ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుంగాపూర్ శివారులో 95 గంజాయి మొక్కలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు


నార్నూర్: ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని సుంగాపూర్ శివారులో గంజాయి సాగు చేస్తున్నట్లు అందిన సమాచారంతో సీసీఎస్, నార్నూర్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన కొడప దేవ్‌రావు సాగు చేస్తున్న 95 గంజాయి మొక్కలను స్వాధీనపరుచుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. 12.4 కిలోల బరువు గల వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.9.5 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నార్నూర్ సీఐ ప్రభాకర్, ఎస్సై అఖిల్, సీసీఎస్, పోలీసులు పాల్గొన్నారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

ఆర్జీయూకేటీలో ముగిసిన వర్క్‌షాప్



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాసర:బాసర ఆర్జీయూకేటీలో ఎలక్ట్రిక్ వాహనాలపై మూడు రోజులు నిర్వహించిన హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. నేషనల్ మిషన్ ఆన్ పవర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ సహకారం అందించిందని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. ప్రపంచం వేగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు పయనిస్తున్న ఈ సమయంలో ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు, ప్రయోజనాత్మక అనుభవం అందించడం అత్యంత అవసరమన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు కేవలం శిక్షణ కార్యక్రమాలు మాత్రమే కాకుండా, భవిష్యత్ ఆవిష్కరణలకు పునాదిగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలు, పరిశ్రమల నుంచి వచ్చిన విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సహా మొత్తం 75 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. దేశ స్వచ్ఛ శక్తి, ఎలక్ట్రిక్ మొబిలిటీ లక్ష్యాలకు తోడ్పడే విధంగా నైపుణ్యాలు పెంపొందించడానికి వర్క్‌షాప్ దోహదపడిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మణ్ ముత్యం, హెచ్‌వోడీ డాక్టర్.బావుసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ పీఆర్వోగా బాలకృష్ణ



పీఆర్‌ఓ డాక్టర్ బాలకృష్ణ

బాసర: బాసర ఆర్జీయూకేటీ నూతన పీఆర్వోగా డాక్టర్ బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. గతంలో డాక్టర్ విజయకుమార్ పీఆర్వోగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో ప్రస్తుతం డాక్టర్ బాలకృష్ణను నియమించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో జరిగే వివిధ కార్యక్రమాలతోపాటు విద్యాపరంగా, సంస్కృతి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు అందజేస్తారని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు రిలే నిరాహార దీక్ష



రిలే దీక్షలో బీసీ సంఘాల నాయకులు

జన్నారం: బీసీ రిజర్వేషన్ల సాధనకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కడార్ల నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. విద్య, ఉద్యోగ పదోన్నతులు, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం, మున్నూరు కాపు సంఘం పొనకల్ పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పొడేటి సతీష్, డివిజన్ మోకు దెబ్బ అధ్యక్షుడు ఒల్లాల నర్సాగౌడ్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు

బోధనోపకరణాలతో విద్యార్థుల్లో ఆసక్తి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కాసిపేట: బోధనోపకరణాలు విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తిని పెంపొందిస్తాయని, విద్యాప్రమాణాల మెరుగుదలకు దోహద పడతాయని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి బోధనోపకరణాల మేళా(టీఎల్ఎం)ను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకతను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్లు చౌదరి సత్యనారాయణమూర్తి, విజయలక్ష్మి, మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వరస్వామి, కాంప్లెక్స్ హెచ్ఎంలు మామిడిపల్లి సాంబమూర్తి, రమేష్ రాథోడ్, సుధాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రో ఖోఖో లీగ్‌కు మడావి ప్రశాంత్



ప్రశాంత్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం చిన్నగూడకు చెందిన మడావి ప్రశాంత్ అల్టిమేట్ ప్రో ఖోఖో లీగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతడిని ఉట్నూర్‌లో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి సోమవారం సన్మానించారు. స్థానిక కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదివి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రశాంత్‌ను పలువురు అభినందించారు. ఇందులో సీనియర్ పీడీ హేమంత్, కోచ్‌లు కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై కేసు

గుడిహత్నూర్: అనుమతి లేకుండా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకోలో పాల్గొన్న 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రహదారిపై బైఠాయించడంతో ప్రజా రవాణాతో పాటు భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. జాతీయ రహదారి సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎలుగుబంటి వేటగాళ్ల రిమాండ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని కోయచిచ్చాల అటవీ ప్రాంతంలో ఎలుగుబంటిని వేటాడిన నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు అటవీశాఖ అధికారులు సోమవారం తెలిపారు. పదిరోజుల క్రితం ప్రధాన నిందితుడు శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. సోమవారం పెంచికల్‌పేట్‌కు చెందిన వెంకటి, సామెర సత్తన్న, ఎల్లూర్‌కు చెందిన మధునయ్యను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎఫ్ఎస్‌వో జగన్, ఎఫ్‌బీవో సతీష్ వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడితే చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.